క్లుప్తంగా

మొక్కలు నాటి సంరక్షించాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని ఎల్.ఐ.సి.హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆపరేషన్స్ మేనేజర్ మానస పిలుపు నిచ్చారు. లోటస్ లాండ్‌మార్క్ సెక్టార్-1 పార్కులో ఆదివారం ఎల్.ఐ.సి.హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌'లో, మేరా మిట్టీ...మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నామన్నారు. అనంతరం సంస్థ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. పలువురికి మొక్కలు అందజేసి వాటిని పెంచాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ కృష్ణకాంత్, సిబ్బంది, లోటస్ లాండ్ మార్క్ సెక్టార్-1 వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా కాపునాడు నగర కార్యదర్శిగా రామకృష్ణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా కాపునాడు విజయవాడ నగర కార్యదర్శిగా కొత్తవారి రామకృష్ణ నియమితులయ్యారు. ఆదివారం గవర్నర్‌పేటలోని ప్రజా కాపునాడు కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు అంజిబాబు నియామక పత్రం అందజేశారు. అంజిబాబు మాట్లాడుతూ కాపుల సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా కాపునాడు ప్రతినిధులు జానకి రామారావు, పసుపులేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'పరిశుద్ధ సిలువ దేవాలయ మహోత్సవాలు'



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలోని పరిశుద్ధ సిలువ దేవాలయ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 15 నుంచి మూడు రోజుల పాటు చేపట్టిన మహోత్సవాల్లో ఆర్సీఎం ఫాదర్లు, వివిధ సంఘాల పెద్దలు, క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో హాజరై ఏసుక్రీస్తుకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహోత్సవాల ముగింపు పురస్కరించుకొని సింగ్‌నగర్ ఫ్లైపులరోడ్డు, ఆంధ్రప్రభకాలనీ, డాబా కొట్లు సెంటర్, ఎంబీ స్టేడియం మీదుగా ఏసుక్రీస్తు, మేరీమాత ప్రతిమలు, సిలువ ఊరేగింపును నిర్వహించారు. అనంతరం రెవ.ఫాదర్ జి.జోజి ఆధ్వర్యంలో దివ్యబలిపూజ జరిగింది. సెయింట్ ఆన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ ఆషా థామస్, క్రైస్తవ విశ్వాసులు, స్త్రీల కూడిక సభ్యులు, యూత్ సభ్యులు, సండేస్కూల్ చిన్నారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): స్వచ్ఛంద రక్తదానికి ముందుకు రావాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం పురస్కరించుకుని కొత్త ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్‌బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో వచ్చిన రోగులకు శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి పలువురికి రక్తం అవసరమవుతుందన్నారు. అలాంటి వారికి స్వచ్ఛందంగా చేసిన రక్తదానం ఉపయోగపడుతుందన్నారు. శిబిరంలో వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లు 25 మంది రక్తదానం చేశారు. స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమం అక్టోబరు 2 నేషనల్ వలంటరీ డే వరకూ కొనసాగనుంది. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ జూపూడి ఉషారాణి, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజిత, కౌన్సిలర్ జోస్ఫిన్, డీపీఎం కిరణ్ పాల్గొన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్



పాయకాపురం(విజయవాడరూరల్): శాంతినగర్‌లో శారద కరాటే స్కూల్లో ఆదివారం కోపుకాన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ జరిగింది. కరాటే స్కూల్ కోచ్ బల్లం కిషోర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కోపుకాన్ కరాటే రాష్ట్ర చీఫ్ ఎగ్జామినర్ పి.వాసు పర్యవేక్షణలో ప్రతిభ చూపిన 40 మంది విద్యార్థులకు ఆరెంజ్ బెల్ట్‌ను మరో 30 మందికి ఎల్లో బెల్ట్ అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాస్, శారద స్కూల్ కన్వీనర్ అప్పలరాజు విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఆదిత్య ఫార్మసీ అధినేత నరసింహారావు, అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి టిక్కం సాయి అన్విత, కరాటే కోచ్‌లు ఎం.కన్న, పి.సత్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం



ముత్యాలంపాడులో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం



రామకృష్ణాపురంలో క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యాన ప్రతిమల పంపిణీ



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న గౌతమ్‌రెడ్డి, క్లబ్ సభ్యులు, కాలనీ పెద్దలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మట్టి గణపతినే పూజించాలని పలువురు చెప్పారు. హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్పొరేటర్ శర్వాణీమూర్తి, బిల్డర్ బి.అమర్‌నాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొని వినాయక ప్రతిమలు అందజేశారు. తులసి విత్తనాలతో తయారు చేసిన 250 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, మల్లిక తెలిపారు. కార్యక్రమంలో సాయి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్‌లో..

మధురానగర్ మెయిన్ రోడ్డులో ఆదివారం సాయంత్రం కృష్ణ ఆధ్వర్యాన మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. సుమారు 500 విగ్రహాలను పంపిణీ చేశారు.

రామకృష్ణాపురంలో..

రామకృష్ణాపురంలో ఆదివారం క్షత్రియ యువజన సంఘం, క్షత్రియ సేవాసంఘం ఆధ్వర్యాన మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. మట్టి వినాయకుడిని పూజించాల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో క్షత్రియ యువజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు వి.రామరాజు, డి.రాజేష్ వర్మ, సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరసింహరాజు, విజయరామరాజు, టీవీఎస్ ఆంజనేయరాజు నాయకులు పాల్గొన్నారు.

జీసీఆర్ కాలనీలో 800 ప్రతిమల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ గౌతమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక 58వ డివిజన్ గుండపు చలపతిరావు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహిస్తున్న వినాయక చవితి పందిరిలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగా సిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆ విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం కాలనీ వాసులకు 800 మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ మెగా సిటీ అధ్యక్షులు నూకల దిలీప్‌కుమార్, పీడీజీ మిర్యాల వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి శివరామకృష్ణ, వై.శ్రీనివాసరావు, విగ్రహాల ఉదయ్‌భాస్కర్‌కుమార్, జీసీఆర్ కాలనీ ప్రెసిడెంట్ గుండపు చంద్రశేఖర్, హరికృష్ణకుమార్ ఉప్పలపాటి శివరామరాజు, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిబ్రహ్మ.. విశ్వకర్మ



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జేజేలు పలుకుతున్న ఎమ్మెల్యే విష్ణు, విశ్వబ్రాహ్మణులు

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సకల జగత్ సృష్టికర్త, ఆదిబ్రహ్మ విశ్వకర్మ అని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. లోకంలోని వృత్తులకు ఆద్యుడైన భగవాన్ శ్రీ విశ్వకర్మ జయంతి వేడుకలను సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనంలో ఎమ్మెల్యే విష్ణు ఆధ్వర్యాన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ పురాణాల ప్రకారం నాలుగు యుగాల్లో విశ్వకర్మ ఎన్నో పట్టణాలను నిర్మించారని తెలిపారు. సత్యయుగంలో స్వర్గలోకం, త్రేతా యుగంలో అయోధ్య, శివుని కోసం సువర్ణ లంక, ద్వాపర యుగంలో ద్వారకానగరాన్ని నిర్మించారని చెప్పారు. పుష్పక విమానాన్ని, శివుడికి త్రిశూలాన్ని, ఆదిశక్తికి గండ్రగొడ్డలిని రూపొందించాడని పేర్కొన్నారు. నేటి తరం శిల్పులకు విశ్వకర్మ మూల పురుషుడని.. ఆయన సంతతి విశ్వ బ్రాహ్మణులు లేని వృత్తి లేదన్నారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, జేజేలు పలికారు. వైఎస్సార్ సీపీ నాయకులు, విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

వీధుల్లో చవితి సందడి



మధురానగర్ మెయిన్ రోడ్డులో సందడి



పత్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం



రాగం మస్తాన్‌రావు వీధిలో విద్యుద్దీపాలంకరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి సందర్భంగా మధురానగర్, ముత్యాంపాడు, అయోధ్యనగర్, మాచవరం తదితర ప్రాంతాల్లో రోడ్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అన్ని రకాల పత్రితో కూడిన సెట్‌ను వంద రూపాయలకు విక్రయించారు. పండ్లు, పూల ధరలు ఎక్కువగా ఉన్నాయి.

ముస్తాబు

వినాయక చవితి వేడుకలకు నగరం ముస్తాబైంది. మధురానగర్, ముత్యాలపాడు, దేవీనగర్, గద్దె వెంకట్రామయ్యనగర్, అయోధ్యనగర్, మాచవరం, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్, దుర్గాపురం తదితర ప్రాంతాల్లో చవితి పందిళ్లు వేశారు. దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదో లైనులో పర్యావరణ గణపతిని ఏర్పాటు చేశారు.

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రకాష్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో వీధుల్లో పత్రి విక్రయాలు జరుగుతున్నాయి. రోడ్లపై ట్రాఫిక్ నిలవకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

హెచ్ఐవీ బాధితులు పౌష్టికాహారం తీసుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులు చక్కటి పౌష్టికాహారం తీసుకోవాలని విజయ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ డాక్టర్ జి. ప్రశాంతి అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన యువభవన్‌లో హెచ్ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. నవజీవన్ బాలభవన్ డైరెక్టర్ నీలం రత్నకుమార్‌తో కలిసి బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం అందజేశారు.ఆమె మాట్లాడుతూ మనోధైర్యం ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ఆరోగ్యకర జీవనానికి పౌష్టికాహారం తీసుకోవాలని, యోగా, శారీరక శ్రమ చేయాలని సూచించారు. నవజీవన్ బాల భవన్ డైరెక్టర్ నీలం రత్నకుమార్ మాట్లాడుతూ రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. రిసోర్స్ కోఆర్డినేటర్ ఎం.మస్తాన్ మాట్లాడుతూ ఎన్ఆర్ఐలు కిజరం ప్రశాంత్, జైని కాశీనాథ్, నాలం ఫణింద్ర, కాంతి అభిషేక్, గార్లపల్లి నిఖిల్ రాజు సహకారంతో పౌష్టికాహారం అందజేశామన్నారు. తమ సేవలు అందించదలచిన వారు 9490491830 నంబరులో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు, కోఆర్డినేటర్స్ వసంత కుమారి, జాకబ్ రాజు, వలంటీర్స్ హైమావతి రాణి, దుర్గ పాల్గొన్నారు.

వినాయకుడికి మకరతోరణం సమర్పణ



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని వినాయకుడి గర్భాలయంలో స్వామివారికి రూ.28 వేలు విలువైన మకర తోరణాన్ని విజయవాడకు చెందిన దాతలు పిచ్చుక శ్రీనివాస్, సుజాత, రోహిత్‌లు సమర్పించారు. ఆదివారం సాయంత్రం సంబంధిత మకరతోరణాన్ని వారి వియ్యంకుడైన మెండు భాస్కర రావు (సాయిరామ్) దంపతులు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివ సత్యవతి దంపతులకు అందజేశారు.

సీఎం జగన్‌కు అండగా ఉంటాం

ఆజాద్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు నాగుల్‌మీరా



ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యవర్గం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముస్లింలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని ఆజాద్ ముస్లిం కమిటీ అధ్యక్షుడు నాగుల్‌మీరా చెప్పారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో కమిటీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర కార్యవర్గం ఎన్నికైంది. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా షేక్ నాగుల్‌మీరా, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అబ్దుల్ అజ్మతుల్లా, ఎండీ కాలేషా, నాగుల్ మీరా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ సాజిద్ అలీ, కోశాధికారిగా షేక్ రఫీ, రాష్ట్ర అధికార ప్రతినిధిగా సయ్యద్ మౌలాలి, షేక్ కలందర్, రాష్ట్ర కార్యదర్శులుగా షేక్ ఇమ్రాన్, షేక్ బషీర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా షేక్ హుస్సేన్ ఎన్నికయ్యారు.వీరితో పాటు ఐదుగురు సహాయ కార్యదర్శులు, 10 మంది రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులు,12 మంది రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగుల్‌మీరా మాట్లాడుతూ మైనార్టీలకు రాష్ట్రంలో నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు, ఐదుగురు ఎమ్మెల్యేలు, 12 మందిని కార్పొరేషన్ల చైర్మన్లుగా నియమించారన్నారు. నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన నాగుల్‌మీరాను పలువురు సత్కరించారు.

భగవద్గీత.. సమాజానికి దిక్సూచి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయాధికారి రమాదేవి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భగవద్గీత మత గ్రంథం కాదని, సర్వమానవ సమాజానికి దిక్సూచి వంటిదని సరస్వతి సామ్రాజ్యం సంస్థ సభ్యులు సునీత అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో విద్యార్థులకు భగవద్గీత తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భగవద్గీత మానవాళికి శ్రీకృష్ణుడు ప్రసాదించిన గొప్ప మార్గదర్శకమని పేర్కొన్నారు. విద్యార్థులకు శ్లోకాలు నేర్పించారు. వారితో శ్లోకాలు పలికించి తాత్పర్యాన్ని వివరించారు. మొదటి అధ్యాయంలో శ్లోకాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సేవాసంఘం కార్యవర్గ ఎన్నిక



క్షత్రియ సేవాసంఘం నూతన కార్యవర్గం నేతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ క్షత్రియ సేవాసంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. అయోధ్యనగర్ అద్దేపల్లి వెంకట సుబ్బరాజు క్షత్రియ భవన్ విజయవాడ క్షత్రియ సేవాసంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. 2023-26 సంవత్సరానికి కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా సాగి నరసింహరాజు, ప్రధాన కార్యదర్శిగా ఉద్దరాజు విజయరామరాజు, ఉపాధ్యక్షులుగా దంతులూరి రామలింగరాజు, సామంతపూడి వెంకట సుబ్బరాజు, పెనుమత్స అప్పలరాజు, సామంతపూడి వెంకట వరప్రసాదరాజు, కోశాధికారిగా డీజేపీఎస్ రాజు, జాయింట్ సెక్రటరీగా లఖంరాజు నారాయణ బాబు, కాకర్లపూడి శ్రీధర్ వర్మ, చేకూరి జగన్నాథరాజు, కళ్లేపల్లి రామకృష్ణరాజు ఎన్నికయ్యారు. నూతన కమిటీ అధ్యక్షుడు సాగి నరసింహరాజు మాట్లాడుతూ తమపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరి మనోభావాలకు అనుగుణంగా క్షత్రియుల అభ్యున్నతికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుత అధ్యక్షులు టీవీఎస్ ఆంజనేయరాజు, సెక్రటరీ కేఎస్ ప్రసాదరాజు, కోశాధికారి వెంకటేశ్వరరాజు నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

విఘ్నాలు తొలగాలి.. కార్యాలు సిద్ధించాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి పర్వదినం సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆదివారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తొలి పూజ, ఆరాధన విఘ్నేశ్వరుడికే చేస్తామని, ఆ గణనాథుని చల్లని దీవెనలతో ప్రజలకు మంచి జరగాలని.. సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు విఘ్నాలు కలగకుండా.. విజయం వైపు నడిపించాలని విఘ్నాధిపతిని వేడుకున్నట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ మట్టి ప్రతిమలతో పూజలు చేయాలని తెలిపారు.

ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

- 11 రోజుల వరకే వినాయక ఉత్సవాల పందిళ్లకు అనుమతి
- భద్రత బాధ్యత ఉత్సవ నిర్వాహకులదే



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్, సీఐలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులు కచ్చితంగా నియమ నిబంధనలను పాటించాలని సౌత్ డివిజన్ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ సూచించారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆదివారం సీఐ ఎం.వి.దుర్గారావు ఆధ్వర్యాన కృష్ణలంక, సూర్యారావుపేట, గవర్నర్‌పేట స్టేషన్ల పరిధిలోని వినాయక మండపాల కమిటీ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. నియమ నిబంధనలు, నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రవికిరణ్ మాట్లాడుతూ 11 రోజుల వరకే వినాయక ఉత్సవాలు పందిళ్లకు అనుమతి ఇస్తామన్నారు. ఉత్సవాల ఊరేగింపును రాత్రి 11 వరకే చేయాలని, హైవే ఎక్కిన తర్వాత ర్యాలీలు, ఉత్సవాలకు అనుమతి లేదని తెలిపారు. రాత్రి 11 గంటలలోపే నిమజ్జన ప్రాంతానికి చేరుకోవాలని, తర్వాత అనుమతించబోమన్నారు. ఉత్సవ ఆర్గనైజర్లు, సభ్యుల పేర్లను, ఫోన్ నంబర్ ముందుగా పోలీసులకు తెలియజేయాలన్నారు. మైక్‌ను ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని చెప్పారు. ఐలవ్ అమరావతి ఐకాన్ వరకే ఉత్సవ నిర్వాహకులను అనుమతిస్తారని, అక్కడ నుంచి మున్సిపాలిటీ సిబ్బంది సాయంతో పోలీసులు నిమజ్జనం ప్రదేశానికి విగ్రహాలను తీసుకెళ్తారన్నారు. తగిన భద్రతను నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరేగింపులో కర్రలు, ఇతర ఆయుధాలు ధరించకూడదన్నారు. ఊరేగింపు సమయంలో ఇతర కులాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయడం, ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించడం చేయకూడదని తెలిపారు. వినాయక పందిళ్లు గానీ, విగ్రహం పెట్టే ప్రదేశంగానీ రోడ్డుపై ఉండరాదన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పందిరి పరిసరాల్లో పొగ తాగడం నిషేధమన్నారు. ఫిర్యాదు అందినా, నిబంధనలు అతిక్రమించినా పర్మిషన్ రద్దు చేస్తారని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కృష్ణలంక, సూర్యారావుపేట, గవర్నర్‌పేట సీఐలు ఎం.వి.దుర్గారావు, బి.హెచ్. వెంకటేశ్వర్లు, డి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధ ట్రస్ట్ సేవలు వినియోగించుకోండి



మధురానగర్(విజయవాడ సెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ, ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ 195 నెలలుగా దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో ప్రతి నెలా వయోవృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని, ఉచితంగా వైద్యపరీక్షలు చేసి అవసరమైన మందులు ఇస్తున్నామన్నారు. నగరంలోని వృద్ధుల కోసం ఉచితంగా హోమియో, ఆయుర్వేదం, అల్లోపతి వైద్యనిపుణులతో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నామన్నారు. వృద్ధులకు అవసరమైన రక్త పరీక్షలను కార్పొరేటర్ శర్వాణీ మూర్తి సహకారంతో ఉచితంగా చేయిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టీలు కె.మధు, గోదావరి వెంకటేష్ పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి ముందు గొడవ పడవద్దని వారించిన యువకుడితో దాడికి దిగిన ఐదుగురిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటకు చెందిన అంచిపోగు వెంకటేశ్వర్లు బీఆర్టీఎస్ రోడ్డులోని ఓ హాస్పటల్‌లో ఆరోగ్యశ్రీకి మేనేజర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. శనివారం అర్ధరాత్రి డ్యూటీ ముగించుకున్న వెంకటేశ్వర్లు ఇంటికి వచ్చాడు. తన ఇంటి ముందు సులేమాన్, బంటి అనే వారు గొడవ పడుతుండగా అడ్డుకున్నారు. దీంతో వారిద్దరు తమ స్నేహితులను తీసుకువచ్చి వెంకటేశ్వర్లుపై దాడి చేశారు. వెంకటేశ్వర్లు మూతికి గాయం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అలరించిన భక్తి సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: వినాయక చవితి పర్వదినం సందర్భంగా మోహన్‌కృష్ణా ఆర్ట్స్ ఆధ్వర్యంలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన భక్తి సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు ఆశయ్య పర్యవేక్షణలో గాయనీ గాయకులు రసూల్‌బాబు, రామభద్రకుమార్, వీరాంజినాయక్, ఎస్.శిరీష, ఎ. నాగలక్ష్మి, లావణ్యరాజి, ఎ.రూప సత్యశ్రీ భక్తి గీతాలతోపాటు క్లాసికల్ గీతాలను మధురంగా ఆలపించారు. మోహనకృష్ణా ఆర్ట్స్ అధ్యక్షురాలు లక్ష్మీబాయి మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో పండుగలను నిర్వహించుకోవాలని సూచించారు. సంస్థ కార్యదర్శి మోహన్ కృష్ణ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలు రూపొందిస్తున్నామని నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు.